కథానిక

# అవతారం చెప్పిన కథ

కొమ్మూరి ఉషారాణి

రామారావు పెళ్ళాంతో పోట్లాడాడు. మీ వాళ్ళు ఏమిపెట్టారంటే మీవాళ్ళు ఏమిపెట్టారనే మామూలు తగవులాటే. అతనికీ, సుశీలకీ పెళ్లయి ఆరు నెలలయింది. అంత త్వరలో భార్యతో పోట్లాడటం రామారావుకిష్టంలేదు. కాని ఏం చేస్తాడు! మాటమీద మాట పెరిగి పోయింది. సుశీల ఏడుస్తుందేమో, ఓదార్చి, స్నేహం చేసుకుందామనుకున్నాడు. ఆమె ఏడవ లేదు. చీకటిలో ఒంటరిగా నడుస్తున్న అతన్ని "మల్లీయం" అనే కేకలు కలవర పెట్టాయి. ఎందుకో మల్లెపూలు చూడగానే సుశీల జ్ఞాపకమొచ్చింది రామారావుకి. తనుకొంచెం ఓపికపడితే పోట్లాట వచ్చేదికాదు. వెధవ కోపం ఎంత త్వరగా వచ్చేస్తుంది! అనుకుంటూ నీళ్లవైపు నడిచాడు.

"హల్లో బ్రదర్" అని అవతారం బుజంమీద చెయ్యివేసేటప్పటికి వులిక్కిపడ్డాడు. వాళ్లిద్దరూ దగ్గిర స్నేహితులు. కబుర్లుచెప్పుకుంటూ కాంటీను వైపు నడిచారు. "ఏమోయ్ అవతారం, చాలా రోజులనుంచి కనబడటంలేదు. వూళ్లో లేవా?" అనడిగాడు రామారావు. "అదంతా చాలావుందిలే. చెప్పడం మొదలెడితే పెద్ద కథ అవుతుంది." అన్నాడు అవతారం. స్నేహితుడు చెప్పమని మరీ తొందర చేసేటప్పటికి యిలా చెప్పుకు పోయాడు.

"నేను యింటర్మీడియేటు మూడు సార్లు తప్పటం బహుశా నీకు జ్ఞాపకముందనుకుంటాను. నాన్నగారు పోయినప్పుడు దమ్మిడీకూడా వదలి పెట్టలేదు. అయినా! వెధవ గుమాస్తాపనికి ఎంత యిస్తారులెద్దూ! నాకు చిన్నప్పటినుంచీ జల్సాగా బతకటమంటే యిష్టం. ఎంత డబ్బయినా యిట్టే ఖర్చయిపోతుంది. లోపల ఏమీ లేకపోయినా, బయటికిమటుకు, మంచి ట్వీడు పాంటులూ, స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్లూ చూసి అందరూ డంగయిపోయేవాళ్లు. టవునులో ఒక యిల్లు తీసుకున్నాను. మార్వాడీలదగ్గిరడబ్బు తెచ్చి, కలక్టరు అమ్మమొగుడులాగా కాలం గడిపేవాణ్ణి.

బైట అందరూ నాకు డబ్బుంది అనుకునేవారు. నాకంతకంటే ఏం కావాలి? డబ్బులేనివాడిని ఈ రోజుల్లో ఎవరు గౌరవిస్తున్నారు చెప్పు? డబ్బుగలవాళ్లని "ఈ డబ్బు ఎక్కడినుంచి వస్తోందని అడిగే గుండెధైర్యం ఎవరికుంటుంది? రోజులు బాగా గడిచిపోయాయి. కాని కొన్నాళ్ళకి అప్పులవాళ్లవత్తిడి ఎక్కువయింది. ఖర్చులు తగ్గించి, పొదుపుగా జీవించే స్వభావంకాదు నాది. ఎందుకూ పనికిరాని చవటలందరూ, మేడలుకట్టేసి, కార్లు ఎక్కి తిరుగుతోంటే నా కళ్లు కుట్టిపోయాయి. డబ్బు సంపాదించి ఎలా సుఖపడాలా అనే అవస్థలో పడ్డాను.

ఆ సమయంలో నాన్నగారు నాకు ఏమీ వదలిపెట్టి వెళ్ళనందుకు కోపమొచ్చింది. పిత్రార్జితమే వుంటే, కాలుమీద కాలేసుకుని హాయిగా వుండేవాణ్ణి, పోనీ ఏదైనా వుద్యోగం ఏడుద్దామంటే చదువులేదాయె. వ్యాపారం పెట్టి పెద్ద ఎత్తున లాభాలుచేసుకునే తెలివితేటలు నాకు లేవు. ఇక మిగిలినవి రెండేమార్గాలు. ఒకటి డబ్బున్న పిల్లని పెళ్ళిచేసుకోవటం, రెండోది పజిల్సు. ఈ రెండిటిలో మొదటిమార్గమే నా ఊహాపథానికి సులభంగా తోచింది.

కాస్త డబ్బుగల పిల్ల దొరకటమనేది ఘట్టి సమస్యే! ఏసినిమాలోలాగో, ఓలక్షాధికారికూతురు నన్ను ప్రేమిస్తే బాగుండుననిపించింది. అదేమిటో కాని, ఆడవాళ్ళతో త్వరగా స్నేహం చేసుకొని, వాళ్లని ఆకర్షించే శక్తి నాకులేదు. ఆ సంగతి యిద్దరు ముగ్గురు స్త్రీలే అన్నారులే! అయినా, డబ్బు, అందం, గుణం, ఈ మూడూ వున్న పిల్ల నాకు తటస్థపడినా, ఆ పిల్లలో ఏదో

లోపముండక తప్పదు. క్షమించు! రామం! నాకు చిన్నప్పటినుంచీ కీడెంచి, మేలెంచడం అలవాటు. పోనీ అటువంటి పిల్ల దొరికే అవకాశం వున్నా, అది త్వరగా అయేపని కాదు. అటువంటి అదృష్టం కోసరం కొన్నాళ్లు, ఓపిక పట్టవలసి వుంటుంది. ఇలాంటి ఆలోచనలతో నా బుర్ర వేడెక్కిపోయింది. ఇద్దరి ముగ్గురికి, పిల్లని చూడమని చెప్పాను, ఈలోపల, నేనుగూడా, వీలయినంత వరకు, వాకబుచేస్తూనేవున్నాను. రోజూ హిందు పేపరు రాగానే మాట్రిమోనియల్ కాలంలోకి తొంగి చూసేవాడిని. కాని నా ఆశలు ఫలించలేదు. ఎంతోమంది కుర్రాళ్లు నాలాగే పెద్దచదువులకి ఫయినాన్షియల్ హెల్పుచెయ్యగల పిల్లలు కావాలనీ వ్యాపారం పెట్టుబడికి ఆ డబ్బుసహాయం చెయ్యగలిగే అమ్మాయిలు వితంతువులయినా కావాలనీ, ప్రకటించటం రోజూ చూశాను. నాకు పోటీగా యింకాచాలామంది డబ్బు అవసరంలో వున్నారు కనుక, నాఆశాసౌధం కూలిపోతుందనే భయం పట్టుకుంది.

స్నేహితుడు ప్రసాదు బలవంతం మీద, ఎండాకాలం శలవులకి మైసూరు వెళ్లాను. వాడి బంధువులింట్లో దిగాను. మాతో కూడా, ఇంకా అరడజనుమంది స్నేహితులున్నారు. మేము దిగిన యిల్లు చాలా పెద్దది. రెండు కార్లూ, నౌకర్లూ, చాకర్లూ జోరుగావుందిలే వ్యవహారం! ఆ ఇంట్లో మొగవాళ్లెవరూ కనుపించలేదు. అది ఒక వకీలు యిల్లుట. ఆయన వితంతు భార్యా, నాలుగేళ్ల కొడుకూ ఆ యింట్లో వుంటున్నారు. ఆవిడకి, భర్త వదలిపెట్టి వెళ్ళిన ఆస్తిగాక, తండ్రిగారు బోల్డంత డబ్బు యిచ్చారుట. అయిదువేలరూపాయల రొక్కమే వుందిట!

ఆ సంగతివినగానే నా మెదడులో తళుక్కుమని ఒక ఆలోచనతట్టింది. ఒకటిరెండుసార్లు, వీలు చేసుకుని, ఆమెను చూడగలిగాను. పేరు అమృతవల్లి. ముప్ఫయిఅయిదేళ్లుంటాయి. నల్లగా,లావుగా వుంది. ముఖమంత వికారంగాలేదు. మళయాళం వాళ్ల పోలికవుంది. తెల్లని చీరా రవికా తొడిగినా, అమృతంలో కొంచెం నవనాగరీకత కనిపించిందినాకు. సాయంత్రమవగానే జుట్టు వదులుగా ముడేసుకొని, కొడుకు వేణుని తీసుకుని, షికారుకివెళ్ళేది మేము క్రిందిభాగంలో ఆవిడ పయిభాగంలో వుండేవాళ్లం. వేణుని చూస్తే మటుకు నాకు భయంగావుండేదిసుమా. అబ్బ! వాడు తెగఅల్లరిచేసేవాడు. ఏమయితేనేం! నా స్వప్నసుందరి, ఇన్నాళ్లకి కనుపించిందిగదాయని మురిసిపోయాను.

కానీ అసలు కష్టమయినపని ఆమెతో పరిచయంచేసుకోవటం. నా అంతట నేనే వెళ్లి ప్రేమించానంటే అనుమానించకతప్పదు. సమయం కోసం కాచుకున్నాను. ఒకరోజు వేణు ఆటలో పడి, ఏడుస్తున్నాడు. వాడిమీదవున్న అసహ్యమంతా చంపుకుని, లేనిప్రేమ నటిస్తూ, ఎత్తుకుని పయికి తీసుకెళ్ళాను. ఆ వెధవ, మెట్లమీదంతా, నన్ను దింపమంటూ, కాళ్ళతో మూతిమీద తన్నాడు. అన్నీ భరించాను. అమృతంరూంలో ప్రవేశించేటప్పటికి, అద్దంలో ముఖంచూచుకుంటోంది. ఆ దృశ్యం చూడగానే, కొంచెం ధైర్యమొచ్చింది. సులభంగా వలలో వేసుకోవచ్చుననుకున్నాను. ఏడుస్తున్న వేణుని చేతికిచ్చి, మొద్దబ్బాయిలాగా అక్కడే నిల్చున్నాను. కూర్చోమని సంజ్ఞచేసింది. నా ఎదురు కుర్చీలోకూర్చుని నాకేసి, రెప్పవాల్చకుండా అయిదు నిముషాలు చూసింది. షర్టుకాలరు సరిచేసుకుని, నిర్భయంగా మళ్ళీ ఆమెని చూశాను. ఉన్నట్టుండి అమృతం ఏడవటం మొదలెట్టింది. ఆశ్చర్యమేసింది. కాళ్లూ చేతులూ వణకటం ప్రారంభించాయి. అక్కడినుంచి వెళ్లిపోవాలో అలాగే నిల్చునామెను ఓదార్చాలో దిక్కుతోచలేదు. మెల్లిగా ఏడుస్తున్న అమృతాన్ని సమీపించి "క్షమించండి. మీకు ఏదో బాధకలిగించినట్లున్నాను"అని నిరాశతో వెనక్కి తిరిగాను. "వెళ్లకండి. మీరు నాకెటువంటి అపరాధం చెయ్యలేదు. మిమ్మల్ని చూస్తే, మూడేళ్లక్రితం చనిపోయిన నా భర్త జ్ఞప్తికి వచ్చారు. ఆయన సరిగ్గా మీ అంతఎత్తూ పొడుగూవుంటారు"అన్నది కళ్లుతుడుచుకుంటూ. "అయ్యో! ఎంత పాపిష్టిపనిచేశాను. మీ కళ్లపడకుండా వుండవలసినది"అంటూ ఆశగా ఆవిడకేసి చూశాను.

అదే మా ప్రథమ పరిచయం. ఆ రాత్రంతా నాకు నిద్రపట్టలేదు. అమృతాన్ని ఎలా బోల్తా కొట్టించటమా అనే సందిగ్ధావస్థలోపడ్డాను. మర్నాటినుంచి, ఆమెనెన్నోవిధాల ఆకర్షించడా

నికి ప్రయత్నించాను. అబ్బ! నేను పడ్డ అవస్థలకి అంతులేదులే! అమృతం పయిన బాల్కనీలో నిల్చున్నప్పుడు కిందనుంచి చూసేవాణ్ణి. ఏటుగా డ్రెస్సు చేసుకుని, ఆమెముందు రకరకాలైన పోజులు పెట్టాను. ఆమెకి ఆపిల్ పళ్ళూ, జామకాయలూ యివ్వమని, పనివాళ్ళ ద్వారా తెలుసుకుని, రెండుబుట్టలు తీసుకొని యిచ్చాను. నా చేష్టలని అమృతమెంతో మెచ్చుకుంటున్నట్లు కనుపించింది. ఆవిడమీద నాకున్న అభిప్రాయాన్ని, అంటే, వివాహసంగతి త్వరగా తెలియబరచకపోతే, అమృతానికి నామీద సోదర ప్రేమకాని, పుత్ర ప్రేమకాని, కలుగుతుందని భయమేసింది.

ఓసారి పిక్నిక్ ఏర్పాటుచేసాను. అమృతాన్ని రమ్మని బ్రతిమాలాను. వేణుని యింటిదగ్గిర వదలి పెట్టి రమ్మని, సజప్తు చేద్దామనుకున్నాను కాని, ఆమె అభిమానం పొందాలంటే, ముందు ఆ పిల్లాడిమీద విధిగా ప్రేమ చూపించాలి. పెద్ద వానులో అంతా కలసి వెళ్ళాము. తోవలో వేణుకి ఎన్ని పిప్పరమెంట్లు కొన్నానో లెక్కలేదు. హాంపీయంతా వాడి నెత్తుకునే తిరిగాను. అమృతం ఎంతో ఆనందించింది.

పిక్నిక్నుంచి వచ్చినతరువాత మా యిద్దరి స్నేహం ఎక్కువయింది. చనువుకొద్దీ ఓరోజు యిలా అన్నాను. "ఏమండీ! ఒక పురుషుడు వయసులో తనకంటే పెద్దదయిన స్త్రీని ప్రేమించటం సంభవమంటారా? వారిప్రేమ సుఖాంతం కాగలదా?"

"ఎందుకు కాదూ? హృదయాలే కలుస్తే, వయసెందు కడ్డు వస్తుందీ? తప్పకుండా వారి ప్రేమ ఫలించవచ్చు" అన్నది "అయితే మీమీద నాకు" అని అనుమానంతో ఆగాను. దేనికైనా తెగించాను. ఆ నిముషంలో అమృతం నన్ను యీడ్చి లెంపకాయే కొడుతుందో, అమాంతం కౌగలించుకుంటుందో తెలీక కళ్ళు మూసుకున్నాను.

"ఇప్పుడు మీ వయసెంత" అన్న ఆమె ప్రశ్నకి ఎక్కువ ఆత్రం కనపరచకుండా, "పాతిక" అన్నాను మెల్లిగా. ఎందుకంటూ వా? నేనొకవేళ అబద్ధమాడినా ఆవిడ రహస్యం తెలుసుకోగలదు. ప్రేమ పేరు వినేటప్పటికి ఎవరికైనా వయసు, కులం, మతం అడ్డు వస్తాయా మరి! ఆడవాళ్ళ దగ్గిర అవసరమయినప్పుడు నిజంచెప్పి, అనవసరమయినప్పుడు అబద్ధాలాడితే చాలా లాభాలున్నాయి. అయినా మంచివడ్డూ, పొడుగూ వున్న నేను అమృతం పక్కన నిల్చుంటే నా వయసెవరు గుర్తించగలరు? ఆ సంగతి అమృతానికీ తెలుసు లే!

ఆ తరువాత అమృతం నేనూ బహిరంగంగా తిరిగాము. మేము చూడని సినిమాలేదు, వెళ్ళని షాపులేదు. వెధవది ప్రతిచోటికీ ఆ సత్రకాయ వేణు వచ్చేవాడు. వాడిని ఎత్తుకోటం ఏడిస్తే ఓదార్చటం, అన్నీ నేనేచేసేవాణ్ణి అమృతానికి ఫేసు పౌడర్లూ, తల నూనెలూ, చీరలూ, ఎన్ని కొనిపెట్టానో లెక్కలేదు. పాపం! అమాయకురాలు, మోసం చేస్తున్నానే యని అప్పుడప్పుడూ విచారించేవాణ్ణి కాని, నాలాంటి ప్రబుద్ధులు ఈ విశాల ప్రపంచంలో ఎంతమందిలేరని సమాధాన పడేవాణ్ణి. మేమిద్దరు బయటకు వెళ్ళినప్పుడు, అందరూ విచిత్రంగా చూసేవాళ్లు అందరూ నన్ను యీర్ష్యతో, ఓర్వలేని చూపులు చూస్తున్నారని అపోహపడేవాడిని. నాకు చాలా గర్వంగా వుండేదిలే! కొలంబసు అమెరికాను కనిపెట్టినట్లు ఆ బంగారుగని అమృతాన్ని నే చేజిక్కించుకున్నందుకు సంతోషం పట్టలేక ఉక్కిరిబిక్కిరయాను.

అమృతంతో బయటకు వెళ్ళినప్పుడు వయసుతో వున్న అందమయిన ఆడవాళ్లు కనుపించగానే, చటుక్కున తలకాయ వంచుకునేవాడిని. అమృతాని కేవిధమయిన ఆగ్రహం కలిగించినా నా ప్లానంతా తల్లక్రిందులవుతుంది. మాటల సందర్భంలో మద్రాసులో నాకొక కారుందనీ, ప్రకాశం పంతులుగారూ, పట్టాభిగారూ నాకు దూరపు చుట్టాలనీ వాగేసాను. ఇదుగో, పెళ్ళి కాకముందు స్త్రీలతో ఎన్నిఅబద్ధాలాడినా తరువాత ఏదోవిధంగా బ్రతిమాలొచ్చు. మా యిద్దరి "ప్రేమా" క్షమించు. దాన్ని ప్రేమ అనకపోతే బాగుండదు, రోజురోజుకీ వృద్ధి పొందింది.

స్నేహితులందరూ మద్రాసు వచ్చేశారు. నేనక్కడే వుండిపోయాను. నాలుగు నెలలయింది. అమృతానికొసారి జ్వరం వచ్చింది. పళ్ళరసం తీసియ్యడం, టయిముకు మందివ్వటం, రాత్రంతా

ఏడుస్తున్న వేణుని ఓదార్చటం, అన్నీ నేనే చేసే వాణ్ణి. కంటిరెప్పలాగ కాచుకుంటూ, మంచం దగ్గిరే వున్నాను. నా ఉదారత్వానికీ, త్యాగ బుద్ధికీ, అమృతం ముగ్ధురాలయింది, నేను వుత్తమ వర్గానికి చెందిన ప్రియుణ్ణని వేనోళ్ళ పొగిడింది. ఆ రోజునుంచీ "డార్లింగ్" అని పిలవసాగింది. ఎన్ని బాధలకోర్చినా, చివరికి ఫలితం తక్కుతుందని సంబరపడ్డాను.

ఓ రోజు సినిమాకెళ్ళాము. ఆట ప్రారంభించక ముందు మా ముందు సీటులో కూర్చున్న ఒక లావుపాటి ఆయన, అమృతం కేసి అదోలా చూడటం గమనించాను. ఇంటర్‌వెల్‌లో కూడా ఆ అపరిచితుడు అమృతంని పలకరిద్దామనే ఉద్దేశముతో తిరిగిచూడటం కనిపెట్టాను. ఆ మెమటుకు ముఖం తిప్పేసుకుంది. ఆట పూర్తికాకముందే వెళ్ళిపోదామని తొందరచేసింది. అనుమానం వేధించుకు తింటున్నా, భయంకొద్దీ వూరుకున్నాను.

మరునాడు ఆత్వాప్రం యింటికే తయారయాడు. అమృతం యింట్లో వున్నా లేదని కబురంపించింది. నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తడం ప్రారంభించాయి.

"అతనెవరు అమృతం? ఎందుకలా తప్పించుకుంటున్నావు?" అంటూ ఆమెదగ్గిర కెళ్లి ఎంతో ముద్దుగా చెయ్యి పట్టుకున్నాము.

"చెపితే ఏమీ అనుకోరుకదా?" అన్నది భయం నటిస్తూ.

"అబ్బే! నిన్ను మనసారా ప్రేమించినాకా నీమీద కోపం" అంటూ, ఎటువంటి వార్త వినవలసివస్తుందో భగవంతుడా! అనుకుని, ఆమె చెయ్యి తీసుకుని నా గుండెమీద పెట్టుకున్నాను.

"ఆఁ ఏమిలేదు. మాఆయన పోయిన ఆరు నెలలకి, అతనితో పరిచయమయింది. ఏవో కథలు రాస్తాడుట! ప్రేమించానని వెంటబడ్డాడు. ఒంటరి జీవితం భరించలేక కొన్నాళ్లు ఇంటికి రానిచ్చాను. కొన్ని పరిస్థితులలో వివాహం కూడా చేసుకునేదాన్నే. కాని వాడుత్త బికారిట! ఆ తరువాత తెలిసింది. వాడిదగ్గిర రాగిదమ్మిడీ లేదుట! మరీ అంత ముష్టివెధవని పెళ్లిచేసుకుని, నేనేం సుఖపడతాను. ఆ సంగతెప్పుడు తెలిసిందో అప్పుడే బయటకి తరిమేశాను. వెధవ! మళ్లీ తయారయాడు. మగవాడయిన తరువాత ఒక హోదా, సంపాదన లేకపోతే ఎలా చెప్పు? వుద్యోగం, పురుషలక్షణం అన్నారు మనపెద్దలు. మగవాడు సంపాదించాలి. ఆడది వంటచేసి యిల్లు చూచుకోవాలి. ప్రకృతి సిద్ధంగావాళ్లలా సృష్టించబడ్డారు. ఇప్పుడు చూడు డార్లింగ్! నాకింత ఆస్తివుందా ఇందులో సగం అనాథశరణాలయానికీ సగం వేణుకీ రాసేస్తాను. నా అదృష్టంకొద్దీ మీరు నాకు దొరికారు. జీవితంలో పవిత్రమైన ప్రేమకంటే, విలువైనది ఏముంది? మద్రాసులో మనిద్దరం కాపురంపెట్టి రోజూ మీరు ఆఫీసువెళ్లటం, నేను వంటచేయటం, సాయంత్రం మీకార్లో షికారు వెళ్ళటం! అబ్బ తల్చుకొంటూంటే, ఎప్పుడెప్పుడు రయిలెక్కుదామా అని వుంది..." అని ఇంకా ఇంకా చెప్పుకుపోతోంది.

నాగుండె పని చెయ్యటం ఆగిపోయింది. ఆమె చెప్పిన మిగతా మాటలు వినిపించలేదు. అమృతం చెయ్యి నా గుండెమీంచి దానంతటదే కింద పడిపోయింది. నాముఖం చూసి అసలు రహస్యం తెలుసుకుని ఎక్కడ డొక్కశుద్ధి చేయిస్తుందో యని భయపడి, ఆరాత్రికి రాత్రే, కట్టుబట్టలతో మద్రాసు పరుగెత్తు కొచ్చేశాను. ఇదీ నాకథ! రామం! ఈ సంగతి మరెవ్వరికీ చెప్పకేం!" అని ముగించాడు అవతారం.

మన నైతిక దృక్పథాన్ని మార్చుకుని, తద్వారా ఆర్థిక, కుల, మత విభేదాలను రూపుమాపి-ప్రజాస్వామ్యానికి మూలాధారం అయిన సమానత్వాన్ని ప్రయత్నించి అలవరచుకుంటేగాని మనన్నెదుర్కునే పరిస్థితుల్ని జయించలేము. చరిత్రలో యింతవరకూ పదిలపరుపబడివచ్చిన నాగరికతను క్షణంలో నశింపచేసే ఆయుధాల్ని కనిపెట్టేకంటే-మానవాభ్యుదయంకోసం వాటిని సరిగా ఉపయోగించే శక్తికలిగిన మనుష్యుల్ని సృష్టించాలి.—బెర్నార్డ్ షా